పోక్సో కేసులో మూడేళ్ల జైలు

కడప అర్బన్ : రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నేరం నిర్ధారణ కావడంతో ముద్దాయి బండారు చంద్రమోహన్‌రావుకు అనే వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తు పోక్సో ప్రత్యేక కోర్టు ఇన్‌చార్జి జడ్జి జస్టిస్ సి.ఎస్.మూర్తి గురువారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకపోతే మరో మూడు నెలలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. వివరాలు.. ప్రకారం జిల్లా వేటపాలెంకు చెందిన ముద్దాయి కడప రిమ్స్ పరిధిలో తైక్వాండో కోచ్‌గా పనిచేసేవాడు. 2019 మార్చి 21న బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె తల్లిదండ్రులు రిమ్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐ విద్యాసాగర్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు సంబంధించి సాక్ష్యాధారాలను విచారించిన తరువాత ముద్దాయికి శిక్ష ఖరారు చేస్తూ తీర్పు చెప్పారు. నేర నిరూపణ చేసిన ప్రస్తుత సిఐ కె. రామచంద్ర, కోర్టు మానటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావు, అప్పటి రిమ్స్ సిఐ విద్యాసాగర్, సిబ్బందిని ఎస్‌పి అన్బురాజన్ అభినందించారు.

నర్సింగ్ సేవలో నాసి!

జిల్లా సర్వజనాస్పత్రిలో నర్సింగ్ సేవలు రోజురోజుకూ తీసికట్టుగా మారుతున్నాయి. సర్వజనాస్పత్రిలోని ఎంఐసి వార్డులో ప్రాణాపాయ స్థితిలో చేరిన రోగులకు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ మెరుగైన సేవలు అందించాలి. ఆ విభాగంలో సహనం, చురుకుదనం, ఆదరణ, అనుభవం కలిగిన హెడ్‌నర్సులు ఉండాలి. అరకొరగానే నర్సులు విధుల్లో ఉంటున్నారనే విమర్శ వినిపిస్తోంది. నర్సింగ్ సేవల తీరును, రోగుల పరిస్థితిని ఎవరికి వారు ఊహించుకోవాల్సి ఉంది. నర్సింగ్ సూపరింటెండెంట్ చుట్టూ ఒకరు ఉండాల్సిన చోట ముగ్గురు, నలుగురు హెడ్‌నర్సులు ఉండడం, నిరంతర పర్యవేక్షణ కొరవడిన ఫలితంగా నర్సింగ్ సేవలు అధ్వానంగా ఉంటున్నాయనే వాదన వినిపిస్తోంది.

- 48 వార్డులకు 31 వార్డుల్లోనే హెడ్‌నర్సులు
- నర్సింగ్ సూపరింటెండెంట్ చుట్టూ ముగ్గురు తిష్ట
- సర్వజనాస్పత్రిలో ఇష్టారాజ్యంగా నర్సింగ్ సేవలు
- పట్టని పాలనా యంత్రాంగం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా సర్వజనాస్పత్రిలో 412 మంది స్టాఫ్ నర్సులు, 34 మంది హెడ్‌నర్సులు సేవలు అందించాల్సి ఉంది. 400 మంది స్టాఫ్ నర్సులు, 31 మంది హెడ్‌నర్సులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 12 మంది స్టాఫ్‌నర్సులు, 17 యూనిట్లకు హెడ్ నర్సులు కొరత ఉన్నట్లు తెలుస్తోంది. వీరందరూ విభాగాల వారీగా సేవలు అందించాల్సి ఉంది. ప్రతిరోజూ రిమ్స్‌లో 1400 నుంచి 1600 మంది ఒపి రోగులు, ఐపి రోగులు 300 మంది రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. ప్రతిరోజూ సుమారు 50 మంది రోగులకు సర్జరీలు చేసిన రోగులే ఉంటున్నట్లు అంచనా.

17 వార్డుల్లో సేవలు అరకొరే

జిల్లా సర్వజనాస్పత్రిలో 48 యూనిట్లు ఉండగా 31 యూనిట్లలో మాత్రమే హెడ్‌నర్సులు విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన 17 యూనిట్లు హెడ్ నర్సుల కొరత పట్టిపీడిస్తోంది. హెడ్‌నర్సుల కొరత వేధిస్తున్న నేపథ్యంలో నర్సింగ్ సూపరింటెండెంట్ దగ్గర ముగ్గురు నుంచి నలుగురు హెడ్‌నర్సులు తిష్ట వేసి కూర్చుకున్నారనే విమర్శలు ఉన్నాయి. వీరిలో ఒకరు ఉండి ముగ్గురు ఆయా యూనిట్లలో సేవలు అందించాలనే వాదన వినిపిస్తోంది. కర్నూలు జిల్లా సర్వజనాస్పత్రిలో ప్రతి సూపరింటెండెంట్ దగ్గర ఒక హెడ్‌నర్సు మాత్రమే విధులు నిర్వహిస్తుండగా, జిల్లా సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ దగ్గర ముగ్గురు నుంచి నలుగురు హెడ్‌నర్సులు తిష్ట వేయడం ఏమిటననే ప్రశ్న వినిపిస్తోంది. నర్సింగ్, వైద్యసేవల అధ్వాన పరిస్థితుల కారణంగా వందలాది మంది రోగులు ప్రయివేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తుండడం విస్మయాన్ని కలి గిస్తోంది.

కలెక్టర్ హామీ బుట్టదాఖలు!

గతేడాది అక్టోబర్‌లో నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఓ జడ్‌పిటిసి సర్వజనాస్పత్రిలో నర్సింగ్ సేవలు అధ్వానంగా ఉంటున్నాయని సభ దృష్టికి తెచ్చిన సంగతి తెలిసిందే. కలెక్టర్ స్పందించి నర్సింగ్ సేవల అంశాన్ని స్వయంగా పరిశీలిస్తానని హామీ ఇవ్వడంతో వ్యవహారం సద్దుమణిగింది. అనంతరం నర్సింగ్ సేవలను తీరును పరిశీలిస్తే ఎటువంటి పురోగతి కనిపించిన దాఖలాల్లేవనే వాదన వినిపిస్తోంది. గతంలో సర్వజనాస్పత్రి బాధ్యతలను చూసిన అప్పటి ఐఎఎస్ అధికారి ధ్యాన్‌చంద్ హయాంలో నర్సింగ్, వైద్యసేవల నిర్వహణలో మెరుగైన ఫలితాలు కనిపించిన సంగతి అందరికీ తెలిసిందే. ప్రస్తుతం సర్వజనాస్పత్రి బాధ్యతలను చూస్తున్న కమిషనర్, కలెక్టర్లు ఆస్థాయి వైద్యసేవలు అందించే ఏర్పాట్లు చేయాల్సి ఉందనే వాదన వినిపిస్తోంది.

సూపర్‌స్పెషాలిటీ సేవలకు పరుగులు

జిల్లా సర్వజనాస్పత్రిలో సూపర్‌స్పెషాలిటీ, సైక్రియాట్రిక్, కేన్సర్, మెటర్నిటీ బ్లాకుల పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. మరో మూడు నుంచి ఆర్నెల్లలో సూపర్ స్పెషాలిటీ స్థాయి సేవలను అందించే దిశగా పరుగులు తీస్తోంది. ఇటువంటి కార్పొరేట్ తరహాలో సర్వజనాస్పత్రి పాలనా యంత్రాంగం నర్సింగ్, వైద్యసేవల మెరుగు దలకు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉరుముతోంది. ఇదేతరహా వైద్యసేవలతో వెళ్లే సూపర్‌స్పెషాలిటీ స్థాయి పేరుకే పరిమితమయ్యే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. మెరుగైన వైద్యసేవల నిమిత్తం తిరుపతి, కర్నూలు, చెన్నయ్, ఏలూరు, హైదరాబాద్ పట్టణ ఆస్పత్రులకు పరుగులు తీయాల్సి ఉంటుందని చెప్పవచ్చు.

మెరుగైన సేవలు అందిస్తాం

నర్సింగ్ సేవల్లో తేడాలుంటే మెరుగుదలకు కృషి చేస్తా. రికార్డులను పరిశీలించి హెడ్‌నర్సుల పనితీరును పరిశీలించడం ద్వారా మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేస్తాం.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్, రిమ్స్. కడప.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ రామరాజు

జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణ కోసం చేపడుతున్న రీసర్వే, భూ సేకరణ పెండింగ్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లాల కలెక్టర్లు, జెసిలతో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తోపాటు జెసి గణేష్‌కుమార్, అధికారులు హాజరయ్యారు. విసి ముగిసిన అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులనుద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సూచనలు, ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలని ఆదేశించారు. రెవెన్యూ, భూ రికార్డుల స్వచ్ఛీకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణ కోసం చేపడుతున్న భూ సేకరణ, పరిహారం ప్రక్రియలను ఎలాంటి పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. వేసవి సీజన్ ను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోచ తాగునీటి అవసరాలకు ఎలాంటి కొరత చూడాలన్నారు. సమావేశంలో సిపిఒ వెంకట్రావు, డ్వామా పీడీ యదుభూషన్ రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, ల్యాండ్ సర్వే ఏడీ కనక ప్రసాద్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు, వ్యవసాయ అనుబంధ శాఖల , సంక్షేమ, సర్వే, ఇంజినీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మోడీని దించి దేశాన్ని కాపాడుకుందాం

సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచార భేరిలో నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రచార భేరిలో సిపిఎం, సిపిఐ నాయకులు

భారత రాజ్యాంగానికి బదులుగా మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని ప్రయత్నం చేస్తూ, భారతదేశ సంపదను దోపిడీ దారులకు కట్టబెట్టే బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని మన దేశాన్ని కాపాడుకుందామని సిపిఐ, సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. నగరంలో ప్రచార బేరి పాదయాత్రను ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి అంబేద్కర్ నగర్, ఎన్టీఆర్ నగర్, చంద్రమౌళి నగర్ వరకు నిర్వహించారు. పెద్ద ఎత్తున మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముఖ్యఅతిథిలుగా సిపిఐ నగర కార్యదర్శి వెంకట శివ, సిపిఎం నగర కార్యవర్గ సభ్యులు చంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఏప్రిల్ 14 నుంచి 30 వరకు ప్రచార బేరి జరుగుతున్న తరుణంలో ఈనెల 29 న కడప కార్పొరేషన్ కార్యాలయం వద్ద బహిరంగ సభ నిర్వహించబోతున్నారని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి రాకముందు మోడీ నిరుద్యోగులకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, కొత్త పరిశ్రమలు తెస్తామని తద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని నిరుద్యోగులను నమ్మబలికించి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టడం ఉన్న పరిశ్రమలు ప్రయివేట్ చేస్తూ ఒక్కొక్కటి భారతదేశ సంపదను దోపిడీదారులకు కట్టబెడుతున్నారన్నారు. విభజన చట్టంలో పొందుపరిచిన ఏ ఒక్క హామీని అమలు చేయకపోగా ఉద్యమ ముద్దుబిడ్డలు బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ఆదాని అంబానీలకు కట్టబెట్టడం అత్యంత హేయమైన చర్య అన్నారు. బిజెపి మతతత్వ, కార్పొరేట్ కూటమి దుర్నీతిని ప్రశ్నించడానికి ప్రజలు సిద్ధం కావాలన్నారు. ఎక్కడికక్కడ మతకలహాలు, వివాదాలు రేపుతున్న మోడీ ముఠా ప్రజల మధ్య విద్వేషపు చిచ్చు రాజేస్తూ మైనార్టీలకు భరోసా కల్పించడం పోయి వారిని దేశంలోనే లేకుండా తుడిచి పారాయాలన్న విధంగా మోడీ రాజకీయాలు నడుస్తున్నాయని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజలపై భారాలు వేస్తుందని విమర్శించారు. పేదలకు విద్యా, వైద్యం అందని ద్రాక్షల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలు ఉన్నాయని విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రతి వ్యక్తి గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు ఉద్ధి మద్దిలేటి, బాదుల్లా, గంగా సురేష్ ,పగడపూల మల్లికార్జున, డీఎం ఓబులేష్ ఆర్ బాబు, నారాయణ, భాగ్యలక్ష్మి, నాగేంద్ర, చైతన్య పాల్గొన్నారు.

రంజాన్ మాసం ముస్లిములకు ఎంతో పవిత్రమైంది

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇఫ్తార్ విందులో టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మీరెడ్డి

రంజాన్ మాసం ముస్లిములకు ఎంతో పవిత్ర మైందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మీరెడ్డి అన్నారు. గురువారం నగరంలోని రవీంద్రనగర్‌లో ఉన్న షామీరియా దుర్గాలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షా మిరియా దర్గా ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. ఈ దర్గాను దర్శించుకున్న వారికి, వారి కుటుంబ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. రంజాన్ మాసంలో ఈ ఇఫ్తార్ విందును ఇవ్వడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈ దర్గాకు తమకు అనుబంధం ఎప్పటికీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మత పెద్దలు, గురువులు టిడిపి నాయకులు ఓబుల్ రెడ్డి, శంకర్ రెడ్డి, అల్లా బా కాష్, మాబు, రవీంద్ర నగర్ లోని ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలకు అవకాశాలు

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

మాట్లాడుతున్న డీన్ డాక్టర్ జి. ప్రభాకర్‌రెడ్డి

వ్యవసాయ విద్యనభ్యసించే విద్యార్థులు 'గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవం' ఇంటర్న్‌షిప్ ద్వారా జ్ఞానం, నైపుణ్యం సాధించడం వల్ల భవిష్యత్‌లో వ్యవసాయ సంబంధిత ఉద్యోగాల్లో మెరుగైన సేవలందించేందుకు అవకాశం లభిస్తుందని వ్యవసాయ కళాశాల అసోసియేటెడ్ డీన్ డాక్టర్ జి. ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఇప్పపెంటలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది జనవరి నుంచి విద్యార్థులు మండలంలోని ఇప్పపెంట, తాడిగొట్ల, కొలుములపల్లి గ్రామాల్లో మూడు నెలల పాటు నివాసం ఉండి రైతులతో కలిసి వ్యవసాయ అనుబంధ రంగాల కార్యక్రమాల్లో పాల్గొని అనుభవం సముపార్జించారని చెప్పారు. నెల రోజుల పాటు ఒక్కో విద్యార్థి ఒక్కో రైతు భరోసా కేంద్రంలో సమగ్రంగా అధ్యయనం చేసి అవగాహన పెంచుకోవడమేగాక రైతులకు సూచనలు, సలహాలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ మురళీకృష్ణ, కృషి విజ్ఞాన కేంద్రం, ప్రోగ్రాం కో - ఆర్డినేటర్ డా.ఎ.వీరయ్య, వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ ఎం. .శ్రీనివాసా చారి శాస్త్రవేత్తలు సోషియట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఎస్.వి. చలం, విస్తరణ శాస్త్రవేత్త ఎస్.రామలక్ష్మి దేవి, ఇప్పపెంట విఎఎ రామ మోహన్ రావు, విహెచ్ఎ రేఖ, ఇప్పపెంట ఎంపిటిసి నాగరాజు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

అగ్నిమాపక శాఖ సేవలు అమోఘం

ప్రజాశక్తి-కడప సిటీ

అగ్ని, రోడ్డు ప్రమాదాలు, విపత్తుల సమయాల్లో అగ్ని మాపక శాఖ సేవలు సమర్థవంతంగా నిర్వహిస్తోందని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మీరాప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కడప అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో సంబంధిత శాఖాధికారులు ముందున్నారని చెప్పారు. బుగ్గవంక వరదల సమయంలో సిబ్బంది చేసిన సేవలను గుర్తు చేసి వారిని అభినందించారు. తహశీల్దార్ శివరామిరెడ్డి మాట్లాడుతూ అగ్నిమాపక సిబంది సేవలు ఎల్లప్పుడు కొనసాగించి ప్రజలను ప్రమాదాల నుంచి కాపాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి వి.వి.ఎస్. రాంప్రకాష్, కడప కేంద్ర సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి బసిరెడ్డి, ఆయా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు. **పోరుమామిళ్ల టౌన్:** అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం పోరుమామిళ్ల అగ్నిమాపక కేంద్రాధికారి ఎల్. వసంత నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు.

కడప : మాట్లాడుతున్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషర్ మీరా ప్రసాద్

విద్యుత్ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

ప్రజాశక్తి - కడప

విద్యుత్ వినియోగదారుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని విద్యుత్ ఎస్ఇ ఎస్. ముని శంకరయ్య అన్నారు. గురువారం స్థానిక విద్యుత్ భవన్‌లో 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయల్ యువర్ విద్యుత్ ఎస్ఇ కార్యక్రమం ద్వారా కడప, ఖాజీపేట, కమలాపురం, కొండాపురం, ముద్దనూరు, బద్వేలు, సిద్ధవటం, పోరుమామిళ్ల, చింతకొమ్మదిన్నె ప్రాంతాల నుండి విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను ఫోన్ ద్వారా తెలియజేసినట్లు తెలిపారు. దాదాపు 16 సమస్యల తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. అన్నింటిని పరిశీలించి పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పి. సుబ్రహ్మణ్యం, జీ.వి. సుబ్బారావు, జెఇ జి. లావణ్య పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

మాట్లాడుతున్న అర్థశాస్త్ర విభాగ బాధ్యులు

కడప : చిరుధాన్యాలు వాడటం వల్ల ఆరోగ్య వంతులుగా ఉంటారని ప్రభుత్వ పురుషుల కళాశాల అర్థశాస్త్ర విభాగం బాధ్యులు కె. శివరాం, కల్లూరీస్ డయాబెటిస్, ఓబిసిటీ కంట్రోల్ సొసైటీ అధ్యక్షులు కల్లూరి రఘురామిరెడ్డి అన్నారు. గురువారం ప్రభుత్వ పురుషుల కళాశాలలో చిరు ధాన్యాల సంవత్సరం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సహజ సిద్ధంగా పండించిన ఆహార వస్తువులు, సిరి ధాన్యాలైన సామలు, ఆరికలు, ఊదలు, కొర్రలు,అండు కొర్రల ఆరోగ్య విలువలను, ఉపాధి అవకాశాలను గురించి కల్లూరీస్ డయాబెటిస్, ఒబిసిటీ కంట్రోల్ సొసైటీ అధ్యక్షుడు కల్లూరి రఘురామి రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అర్థశాస్త్ర విభాగం బాధ్యులు కె.శివరాం మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాలు సంవత్సరంగా ప్రకటించిందని గుర్తుచేస్తూ చిరుధాన్యాల ప్రాధాన్యతను తెలియజేశారు.

ఉత్తమ విలువలు స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో సాధ్యం

ప్రజాశక్తి- కడప

సమాజానికి విలువలు కలిగిన ఉత్తమ పౌరులను అందించడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రధాన పాత్ర పోషిస్తుందని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి రవీంద్రనాథ్ అన్నారు. గురువారం ఆర్ట్స్ కళాశాలలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం వారిచే కళాశాలలో విద్యార్థులకు నాలుగు స్కౌట్స్ విభాగాలను ఏర్పాటు చేశామన్నారు. రిజిస్ట్రేషన్ పత్రాలను స్కౌట్ సిబ్బంది కళాశాల ప్రిన్సిపాల్ కు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, ఎన్.సి.సి అధికారి లెఫ్టినెంట్ డా. నీలయ్య, దయానందం, రాఘవేందర్ రెడ్డి, డాక్టర్ రామచంద్ర, రెడ్డి భాష పాల్గొన్నారు.

ఫార్మకాలజీ విభాగానికి ఏడు పీజీ సీట్లు మంజూరు

ప్రజాశక్తి-కడప సిటీ

పీజీ సీట్ల మంజూరుపై హర్షం వ్యక్తంచేస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

రిమ్స్ కళాశాలలోని ఫార్మకాలజీ విభాగానికి ఏడు సీట్లు మంజూరయ్యాయని ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సురేఖ పేర్కొన్నారు. గురువారం ఫార్మకాలజీ విభాగానికి చెందిన వైద్య అధ్యాపకులు, వైద్యులు, సిబ్బందితో కలిసి ఆమె కేక్ కట్‌చేసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీజీ సీట్ల పెంపునకు సహరించిన అందరికీ ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మిబాయి, ఫోరెన్సిక్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస్‌నాయక్, ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజేష్, డిడి డాక్టర్ శంకర్‌రెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి - కడప

జిల్లాలో సిబిఎ-3, ఎస్ఎ-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎస్‌సిఇఆర్‌టి స్టేట్ అసెస్మెంట్ సెల్ సభ్యుడు ఎన్.వి గంగరాజు పేర్కొన్నారు. గురువారం స్థానిక బాలవికా స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సిబిఎ-3 పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ఒఎంఆర్ జవాబు పత్రాలను నింపాలని, ఈ పరీక్షలో జిల్లాకు వెయ్యి విద్యార్థులు చొప్పున ఒఎంఆర్ జవాబు పత్రాలను పంపారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనలు ప్రకారం ఎలాంటి లోటు పాట్లు జరగకుండా పరీక్షలు నిర్వహించాల సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలను మదింపు చేయడానికి , పరీక్షలు ఎంతో ముఖ్యమని ఎన్ వి గంగరాజు పేర్కొన్నారు. కార్యక్ర మంలో సాయిబాబా ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ సుధీర్‌రెడ్డి, బాలవికాస్ హై స్కూల్ కరస్పాండెంట్ గంగయ్య , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెమ్మ మియాపేట ప్రధానోపాధ్యాయురాలు సోఫియా పాల్గొన్నారు.

లా పరీక్షా కేంద్రంలో విసి తనిఖీ

కడప అర్బన్: యోగి వేమన విశ్వ విద్యాలయంలో జరుగుతున్న లా సెమిస్టర్ పరీక్షలను విసి ఆచార్య జింక రంగ జనార్ధన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డితో కలిసి ఉపకులపతి ఆచార్య జింక రంగ జనార్ధన్ ఎపిజె అబ్దుల్ కలాం గ్రంథాలయ ప్రాంగణంలో జరుగుతున్న లా పరీక్షా కేంద్రానికి వచ్చారు. విద్యార్థులతో మాట్లాడారు పరీక్షల ఏర్పాట్లపై, సౌకర్యాలపై సహాయ సూపరింటెండెంట్ డాక్టర్ మునికుమారి విసికి వివరించారు. 740 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 628 మంది రాస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఉండేలా చూడాలని సూచించారు. ఈనెల 15 నుంచి పరీక్షలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డాక్టర్ ఎస్వీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'ఆదరణ'లో న్యాయ విజ్ఞాన సదస్సు

కడప : నగరంలోని పాతరిమ్స్ ఆవరణలో ఉన్న ఆదరణ నిరాశ్రయుల వసతి గృహాన్ని సీనియర్ సివిల్ జడ్జి గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముందుగా వసతి గృహాన్ని సందర్శించి అక్కడున్న వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే డిఎల్ఎస్ఎ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీనియర్ సిటిజన్ టోల్ ఫ్రీ నెంబర్ 14567 పైన అవగాహన కలిగించారు.

పెద్దదర్గాలో సినీనటుల ప్రార్థనలు

కడప అర్బన్ : కడప అమీన్ పీర్ దర్గాను డైరెక్టర్ నందిని రెడ్డి, యువ నటుడు సంతోష్ శోభన్, మాళవిక కుమార్ గురువారం సందర్శించి ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. దర్గా సంప్రదాయం ప్రకారం దర్గా నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. దర్గా విశిష్టతను అడిగి తెలుసుకున్న డైరెక్టర్ నందిని రెడ్డి, యువ నటులు సంతోష్ శోభన్, మాళవిక కుమార్. దర్గాను దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

స్టార్టప్‌పై అవగాహన

కడప అర్బన్ : ఎఐసి ఎస్‌కెయు స్టార్ట్ అప్ జి -20 ప్రెసిడెన్సీలో స్టార్టప్‌కి గుర్తుగా 'పర్యావరణ వ్యవస్థలో గ్రామీణ రంగం తదుపరి గమ్యం' అనే అంశంపై గురువారం కెఎస్ఆర్ఎం కళాశాలలో స్టార్టప్ పై అవగాహన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ ఐ. శివ కిరణ్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు గ్రామీణ రంగంలో స్టార్టప్‌ల పాత్ర, అభివృద్ధి వంటి మౌలిక వసతుల గురించి వివరించారు. ఇంక్యుబేషన్ హెలెన్ బైక్స్ సిఇఒ లోకేష్ తన అభిప్రాయాలను, ముఖ్య ఉద్దేశాలను విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం ఇంజినీరింగ్ కళాశాల, కంపెనీ మధ్య అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ అవగాహన ఒప్పందం చేసుకోవడం పట్ల కళా శాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని) హర్షం వ్యక్తం చేశారు.

ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు

డిప్యూటీ సిఎంకు వినతి పత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

కడప అర్బన్ : బిసిలైన వాల్మీకి, బోయ, బెంతో, ఒరియా కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చవద్దని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా సభ్యులు కోరారు. గురువారం ఉప ముఖ్య మంత్రి అంజాద్ బాషాకు సేవా సంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశంలో అభివృద్ధి చెందిన బీసి లైన వాల్మీకి, బోయ, బెంతో, ఒరియా కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రతిపాదించిన సందర్భంగా, వాటిని తక్షణమే వెనిక్కీ తీసుకుని గిరిజనుల అభివృద్ధి కి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్. ఐ. శివా నాయక్, రాష్ట్ర సభ్యులు అర్జున్ నాయక్, జిల్లా అధ్యక్షులు డాక్టర్. సునీల్ కుమార్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బుక్కే జగన్ రాథోడ్, గౌరవ అధ్యక్షులు వెంకట స్వామి నాయక్, యువజన అధ్యక్షులు కిరణ్ నాయక్, వైయస్సార్ సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు వేణు గోపాల్ నాయక్, కృష్ణ నాయక్, రామాంజులు నాయక్, శ్రీను నాయక్ పాల్గొన్నారు.

జైభారత్ సత్యాగ్రహ సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కడప

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

విజయవాడలోని జిఖానా మైదానంలో ఈనెల 24న నిర్వహించే జై భారత్ సత్యాగ్రహ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నగర అధ్యక్షులు వై విష్ణు ప్రీతం రెడ్డి పిలుపునిచ్చారు. జై భారత్ సత్యాగ్రహ సభకు సంబంధించి చలో విజయవాడ పోస్టర్లను గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ నగర అధ్యక్షులు ప్రీతం రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విష్ణు ప్రీతం రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కాకూడదు అనే లక్ష్యంతోనే బిజెపి పార్టీ పనిచేయడం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి,చీకటి చార్లెస్,బీసీ సెల్ రాష్ట్ర కో కన్వీనర్ శ్రీనివాసులు,,బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కుళ్ళయప్ప, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఆర్టిఐ చైర్మన్ లక్షుమయ్య, యూత్ కాంగ్రెస్ ఆర్ఐటి రాష్ట్ర ప్రధాన కార్యర్శి గూడూరు సాయి వినయ్ కుమార్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యూత్ జోడో బూత్ జోడో రాష్ట్ర కో-ర్డినేటర్ నందిమండలం విజయ్ సుశీల్ కుమార్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉప అధ్యక్షులు వెన్నపూస మధు రెడ్డి , కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య , హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు బాబు, యూత్ కాంగ్రెస్ సిటీ ప్రెసిడెంట్ శివ శంకర్ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేకతను మళ్లించేందుకే విశాఖ అంశం : టిడిపి

కడప అర్బన్: రాష్ట్రంలో ఏ అంశం పైనా ప్రజా వ్యతిరేకత వస్తే చాలు సిఎం జగన్మోహన్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ ఆడుతూ ఉంటారని టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి విమర్శించారు. గురువారం గాయత్రీ టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. వై.ఎస్. వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాష్ రెడ్డి పైన వస్తున్న ఆరోపణలను డైవర్ట్ చేసేందుకు రాజధానిని విశాఖపట్నానికి సంసారం వెళుతున్నామని చెబుతున్నారని పేర్కొన్నారు. శ్రీకాకుళంలో ఉన్న ములాపేటలో బొంబాయి, చెన్నై నగరాలుగా అభివృద్ధి చేస్తానని సిఎం జగన్మోహన్ రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కడప లో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పర్యటన పూర్తిగా విజయవంతమైందన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడిపి గెలుపు కోసం నాయకులు ఉత్సాహంగా కసిగా పనిచేయబోతున్నారని పేర్కొన్నారు.

ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించిన కమిషనర్

కడప అర్బన్ : కమిషనర్ జి. సూర్య సాయి ప్రవీణ్ చంద్ గురువారం మున్సిపల్ ఇండోర్ స్టేడియం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఇండోర్ స్టేడియంలో ఉన్న బ్యాడ్మింటన్ ఫ్లోరింగ్ పరిశీలించి పలు సూచనలను అధికారులకు చేశారు. ఇండోర్ స్టేడియంలో ఉన్న మరుగుదొడ్లను పరిశీలనలో భాగంగా పలు మరమ్మతులను చేయించాలని, మరుగుదొడ్లు ఉపయోగంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

మాట్లాడుతున్న జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి

మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న జగనన్న కాలనీలో జరుగుతున్న ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని జడ్‌పిటిసి రవి కుమార్‌రెడ్డి కోరారు. జగనన్న కాలనీలో జరుగుతున్న ఇంటి నిర్మాణాలపై ఇంజ నీరింగ్ సిబ్బంది హౌసింగ్ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టని లబ్ధిదారులతో చర్చించాలని సూచించారు. ఆర్‌డిఓ వెంకటేష్ మాట్లాడుతూ అనుకున్న సమయానికి ఇంటి నిర్మాణ పనులు పూర్తి య్యేందుకు సిబ్బంది పని చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమీక్ష సమావేశంలో ఎంపిపి లక్ష్మీగాయత్రి, మండల స్పెషల్ ఆఫీసర్ రవీంద్రారెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిడిఒ, పంచాయతీ కార్యదర్శి లు పాల్గొన్నారు.

జగన్ సుభాషితాలు వల్లించడం హాస్యాస్పదం

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

శ్రీకాకుళం జిల్లాలో సిఎం జగన్ సుభాషితాలు వల్లించడం హాస్యాస్పదమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. తనకు అబద్ధాలు చెప్పే అలవాటు లేదు.. ఆర్థిక, అంగబలం లేదని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పే మాటలు చూస్తుంటే సత్యహరిశ్చంద్రుడు కూడా ఆయనకు సరిరారనిపిస్తోందని ఎద్దేవా చేశారు. స్థానికంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎప్పుడూ మాట తప్పను మడమ తిప్పను అని చెప్పే జగన్ మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి విశాఖలో కాపురం ఉంటానని జగన్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. అబద్ధాలు చెప్పడం జగన్‌కు దినచర్యగా మారిందని విమర్శించారు. గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అమరావతిలోనే కాపురం ఉంటానని చెప్పి, ప్రస్తుతం విశాఖలో పెడతానని చెప్పడం శోచనీయమన్నారు.

లోకేష్ పాదయాత్రలో ప్రవీణ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కర్నూల్ జిల్లా ఆదోని నియోజకవర్గంలోని నాగలాపురంలో జరుగుతున్న యువగళం పాదయాత్రలో ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. నారా లోకేష్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిస్థితుల గురించి చర్చించారు.

పలు అంశాలను చర్చిస్తున్న లోకేష్, ప్రవీణ్

రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేసి, అందులో ప్రజలను భాగస్వాములను చేయాలని లోకేష్ సూచించారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడే కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారని ప్రవీణ్ తెలిపారు. 2024 ఎన్నికల్లో టిడిపి గెలిచేందుకు కృషి చేస్తామని లోకేష్‌కు హామీ ఇచ్చారు. ఆ మేరకు అందర్నీ కలుపుకొని వెళ్తామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - మైలవరం

ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న భూపేష్‌రెడ్డి

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని జమ్మలమడుగు టిడిపి ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నిర్వ హించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన టిడిపి అధినేత చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా లచ్చంభాయ్ తండాలో వేడుకలను నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రజలపై చేస్తున్న అరాచక, అవినీతి, దోపిడి పాలన గురించి వివరించారు. చంద్రబాబు నాయుడు మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నికుంటేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని పేర్కొన్నారు. కార్య క్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, రాష్ట్ర బీసి సెల్ ప్రధాన కార్యదర్శి కొండయ్య, దస్వాద పాపిరెడ్డి, టిడిపి కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మందుల పంపిణీపై నోడల్ అధికారి ఆరా

చాపాడు : స్థానిక పిహెచ్‌సి పరిధిలోని వియ్యపాడు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా అని నోడల్ అధికారి డాక్టర్ నాగేంద్ర కుమార్ రోగులతో ఆరా తీశారు.

104 సిబ్బందితో నోడల్ అధికారి నాగేంద్రకుమార్

ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్, ఓపి, గర్భిణుల రికార్డులను పరిశీలించారు. 104 వెహికల్ దగ్గరకు రాలేని, మంచానికి పరిమితమైన రోగులతో మాట్లాడి వైద్యం అందుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్, డాక్టర్ ఒబులేసు, ఎఫ్‌పిఎస్ పర్యవేక్షకులు భాస్కర్, వైద్య సిబ్బంది, ఆశాలు, పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సాయిరాజేశ్వరి కాలనీ చెందిన వారు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. పట్టణ సందమూరి సేవాసమితి గౌరవాధ్యక్షులు తాటిపాటి రామగోపాలశర్మ ఆధ్వర్యంలో బియ్యం, పంచదార, ఉప్పు, రిఫైన్డ్ ఆయిల్, కాయగూరలు అందజేశారు. కార్య క్రమంలో కడప పార్లమెంటరీ ఎస్సీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి మలిగెలి మల్లి కార్జున, కడప పార్లమెంటరీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నాసారి లక్ష్మీనరసింహా, కడప పార్లమెంటరీ టిడిపి వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు గోమేధికమ్ సుదర్శన్, పట్టణ సిటీయన్ ఆర్ట్స్ ఇన్‌చార్జి సి.జి.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

కార్యాలయాల్లో కొరవడిన 'స్వచ్ఛభారత్'

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ప్రభుత్వ కార్యాలయాల తీరు చూస్తే సర్కారు ఆశయాలకు ఆమడ దూరంలో నిలిచాయని చెప్పవచ్చు. ఇందుకు జమ్మల మడుగులోని పలు ప్రభుత్వ కార్యాలయాలు అద్దం పడుతున్నాయి. పట్టణంలోని తహశీల్దార్, ట్రెజరీ, జమ్మలమడుగు అర్బన్ పోలీస్‌స్టేషన్, రూరల్ పోలీస్‌స్టేషన్ వంటి ప్రధాన కార్యాల యాలు ఒకే చోట ఉన్నాయి. ఈ కార్యాలయాల వద్ద స్వచ్ఛ భారత్, పారిశుధ్యం, పచ్చదనం-పరిశుభ్రత వంటి ప్రజాహిత కార్యక్రమాలు పడకేశాయి. పట్ట ణంలోని మరో కార్యాలయాల సమూహం మం డల పరిషత్, గృహ నిర్మాణం, పంచాయతీ రాజ్ శాఖ, ఐసిడిఎస్ కార్యాలయాల చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ఉన్నాయి. దీంతో ప్రభు త్వ కార్యాలయాల ఆవరణ విష పురుగులకు నిల యాలుగా మారాయి. ఆయా ప్రాంతాల్లో విష పురుగులు సంచరిస్తున్నట్లు అక్కడ పనిచేస్తున్న సిబ్బంది చెబుతున్నారు. ఆర్‌డిఓ కార్యాలయం వద్ద కుప్పలు తెప్పలుగా ఇసుక దర్శనమిస్తోంది. అంటే పచ్చదనం-పరిశుభ్రతపై ఉద్యోగులకు ఎంత మక్కువ ఉందో దీన్నిబట్టి అర్థమవుతోంది. అలాగే ప్రజలకు అవసరమైన విషయాలు తెలి యజేయాల్సిన సూచిక బోర్డులు ఖాళీగా దర్శ నమిస్తున్నాయి. పోలీస్‌స్టేషన్ ఆవరణలో తుప్పు పట్టిన వాహనాలు, ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ప్లాస్టిక్ కవర్లు కుప్పలు ఉన్నాయి. నిత్యం విధి నిర్వహణలో ఉన్నా.. వీటిని తొల గించాలనే ఆలోచన రాకపోవడం గమ నార్హం. ఆయా ప్రాంతాల్లో ఉన్న విశాలమైన ప్రదే శాల్లో పారిశుధ్యం, స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాలు చేపట్టి, శ్రమదానంతో చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించాలని ప్రజలు కోరు తున్నారు. కార్యాలయాల ఆవరణలో మొక్కలు పెంపకం చేపడితే అందమైన ప్రదేశా లుగా మారే అవకాశం ఎక్కువగా ఉంది. ఆ దిశగా అధికారులు స్పందించాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

అర్బన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు

ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఉన్న వ్యర్థాలు

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలను గురువారం టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను నాయకులు వేర్వేరుగా సంబరాలు చేసుకున్నారు. వేంపల్లెలో ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, టిడిపి కార్యాలయంలో మండల కన్వీనర్ రామమునిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆర్‌వి రమేష్, సీనియర్ నాయకుడు పాపిరెడ్డి, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వల్లి, మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్, బిసి సెల్ మండల కన్వీనర్ గోగుల మల్లికార్జున, పూల అల్లాభక్షు, టివి మెకానిక్ శీను, జిబిబుల్లా, వేమకుమార్, మారుతి, శివ, శశిధర్‌రెడ్డి, ఈశ్వరయ్య, వెంకటయ్య, రామచెన్నారెడ్డి, పివి రమణ, కృష్ణారెడ్డి, తిప్పారెడ్డి, గొటూరు నాగభూషణం, మహబూబ్ షరీఫ్, భాస్కర్‌రెడ్డి, ఇలియాస్, ఎద్దుల కొండయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఖాజీపేట :** చంద్రబాబు జన్మదిన కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. సాయిబాబా ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. ధయాంఖాన్‌పల్లె టిడిపి నాయకులు గడ్డం జానకిరామ్ నాయుడు ఏర్పాటు చేసిన కేక్‌ను పార్టీ మండల కన్వీనర్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి కట్ చేశారు. నాయకులు త్రిపురవరం హరినాథరెడ్డి, పత్తూరు ఉప సర్పంచు ముత్తూరు రమణ, రామానాయుడు, రమేష్ నాయుడు, దామోదర్‌రెడ్డి, నాగార్జున యాదవ్, శ్రీనివాసపురం కృష్ణ, చెన్నముక్కపల్లి నరసింహులు యాదవ్, మిడుతూరు అంకాల యాదవ్, జంపన ఓబుల్‌రెడ్డి, సరిటాల వీరయ్య, దాసరి శ్రీనివాస్ యాదవ్, తుట్టే రాము యాదవ్, పాపన మల్లికార్జునరెడ్డి, పల్లె గంగాధర్, బాలకొండారెడ్డి పాల్గొన్నారు. ములపాకు సమీపంలోని లారెన్స్ వృద్ధాశ్రమంలో చంద్రబాబు జన్మదినం సందర్భంగా ఆ పార్టీ నాయకులు నాగార్జున యాదవ్ అన్నదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జానకిరామ్ నాయుడు, బండి చిన్న, రమేష్ నాయుడు, నరసింహులు యాదవ్, రవి నాయుడు, వెంకటేష్ నాయుడు, రమేష్ నాయుడు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు జన్మదిన వేడుకలు ప్రొద్దుటూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్, పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి, రూరల్ మండల బాబుల్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి నల్లబోతుల నాగరాజు, రాజుపాలెం మండల కన్వీనర్ ధనిరెడ్డి విశ్వనాథరెడ్డి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి తాటి శ్రీనివాస్ యాదవ్, కొర్రపాడు సర్పంచు ధనిరెడ్డి శ్రీనివాసుల, శివనాగిరెడ్డి, పర్లపాడు చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి కోటా శ్రీదేవి, పట్టణ మహిళా అధ్యక్షురాలు బోగాల లక్ష్మీనారాయణమ్మ, 28వ వార్డు లక్ష్మీనారాయణమ్మ, జిల్లా అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరయ్య పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** స్థానిక టిడిపి కార్యాల యంలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను టిడిపి మండల అభిమానులు, నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. మండల ఇన్‌ఛార్జి జయరామిరెడ్డి, మండల బాధ్యులు మోహన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, బయపురెడ్డి పాల్గొన్నారు. **ముద్దనూరు :** మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల మైనారిటీ నాయకులు అబ్దుల్ ఖాదర్, పట్టణ అధ్యక్షుడు రంగారెడ్డి, మండల అధ్యక్షులు శివరామి రెడ్డి, నాయకులు బాబాఅమీర్, నాగేశ్వరరావు, బాబా ఫక్రుద్దీన్, మున్నా, కార్యకర్తలు పాల్గొన్నారు. **కడప అర్బన్ :** చంద్రబాబు జన్మదిన వేడుకను ఆ పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్‌టిఆర్ కూడలిలో 73 కిలోల భారీ కేక్ కట్ చేశారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, హరిప్రసాద్, సీనియర్ నాయకులు లక్ష్మ రెడ్డి, పోతుగంటి పీరయ్య, మాజీ జిపి గుర్రప్ప ,రాంప్రసాద్, జనార్ధన్, ఏలియా, శంకర్ రెడ్డి, కాసిం, అమీర్, సుధాకర్ యాదవ్, మహిళ నాయకులు పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె :** మాజీ ముఖ్యంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను కడప నగరంలోని బాలాజీ ఆస్పత్రిలో టిడిపి నాయకులు, డాక్టర్ కృష్ణకిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిం చారు. భారీ కేక్ కట్ చేసి అభిమానులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. రాబోయేది టిడిపి ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. **వల్లూరు :** పిహెచ్‌సిలో చంద్రబాబు జన్మదిన వేడుకలు టిడిపి మండల అధ్యక్షుడు లేబాక నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి రోగులకు బెడ్లు పంపిణీ చేశారు. టిడిపి నాయకులు కొప్పోలి మాజీ సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, మాజీ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, నాగ సుబ్బారెడ్డి, కొప్పుల చిట్టిబాబు, సురేష్, రామచంద్రారెడ్డి, దర్శ వెంకట సుబ్బ రాయుడు, మదన్మోహన్ రెడ్డి, రాజేష్, నాగేంద్ర, అబ్దుల్ రసూల్, చెన్నారెడ్డి, ఖాజా పీర్, పీజీ కిషోర్, కృష్ణారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ఎన్.రమణారెడ్డి, గోపాల్, మాధవరెడ్డి, సుబ్బారెడ్డి, ఇసుకపల్లి వెంకట సుబ్బారెడ్డి, సుబ్బరాయుడు, ఈశ్వర్ రెడ్డి, నరసింహ పాల్గొన్నారు. **పోరుమామిళ్ల టౌన్:** బస్టాండ్ సమీపంలోని సిసిఆర్ కాంప్లెక్స్‌లో కమ్మవారిపల్లి చెరుకూరు రవి ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చెరుకూరి చెంద్రాయుడు కేక్ కట్ చేశారు. చెరుకూరి నడిపి వెంకట సుబ్బయ్య, టీడీపీ యువ నాయకులు చెరుకూరి రవికుమార్, చెన్నకృష్ణ, మల్లికార్జున రెడ్డి,దమ్మన పల్లి సర్పంచ్ ఎం. సత్యరాజు,కృష్ణ, మద్దూరి యేసయ్య, చిన్న,ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..!

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జగనన్న పాలనలో ఇసుకకు కొదవలేదు.. ఇసుక రీచ్‌లో ట్రాక్టర్, టిప్పర్‌కు పెట్టిన ధర కంటే రూ.200 అదనంగా చెల్లిస్తే ఇసుక ట్రాక్టర్ మోసుకుపోయేంత. దారి వెంబడి ఆ వాహనంలోని ఇసుక పడుతోంది. వాహనాలపై వెళుతున్న వారు జారి కింద పడేంతా పోస్తారనే మాట జిల్లాలో బలంగా వినపడుతోంది. ముఖ్యంగా జమ్మలమడుగులోని అంబవరం రీచ్. ఇసుక రీచ్ వద్ద నుంచి మెయిన్ రోడ్డు 67వ జాతీయ రహదారి ఎక్కిన తర్వాత అటు ముద్దనూరు వైపు కానీ, ఇటు జమ్మలమడుగు పట్టణం వైపుకానీ రహదారికి ఇరువైపులా కావాల్సినంత ఇసుక రాలిపోయిందంటే ఆశ్చర్యపడాల్సిన అవసరంలేదనే చెప్పాలి. ఇసుక రీచ్‌లలో వాహనాలకు ఎంత ఇసుక పోసినా, వాటికి డబ్బు కట్టి తీసుకెళ్తున్నారా లేక అక్రమంగా రవాణా చేస్తున్నారా అనేది మైనింగ్ అధికారులు, పోలీసులు, రెవెన్యూశాఖ వారు కానీ అడిగే దాఖలాల్లేవని పలువురు ఆరోపిస్తున్నారు. కనీసం రహదారి వెంబడి ఇష్టానుసారంగా ఎటుచూసినా ఇసుక ట్రాక్టర్లు వేగంగా పోవడంతో రోడ్డంతా ఇసుక పడుతోంది. ఇతర వాహనాలు అదుపుతప్పి పడితే పెద్ద ప్రమాదాలు జరుగుతాయని వాహనదారులు హడలిపోతున్నారు. ఆర్అండ్‌బి అధికారులైనా రోడ్లపై పడిన ఇసుకను తొలగించాలని వాహన దారులు, ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి, పరిమితి మేరకు ట్రాక్టర్లు, టిప్పర్లు ఇసుకను తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

67వ జాతీయ రహదారిలో పేరుకుపోయిన ఇసుక

మున్సిపల్ కార్యాలయంలో ఆర్‌డి తనిఖీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నగర పంచాయతీ కార్యాలయాన్ని గురువారం రీజనల్ డైరెక్టర్ మూర్తి తనిఖీ చేశారు. మున్సిపాలిటీలో జరుగుతున్న రీ సర్వే పనుల గురించి నగర పంచాయతీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఐదు మున్సిపాలిటీలను రీసర్వేకు పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారన్నారు. ఇందులో మూడు మున్సిపాలిటీలు అనంతపురం రీజినల్ పరిధిలోనే ఉన్నాయన్నారు. డోన్, రాజంపేట, ఎర్రగుంట్ల మున్సిపాలిటీలు పైలెట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వం ఎంపిక చేసినట్లు తెలిపారు. కడప రోడ్డులోని మురుగు కాలువకు సంబంధించి టెండర్ పూర్తయి ఏడాది కావస్తున్నా పనులు మొదలుపెట్టకపోవడంపై విలేకరులు అడగ్గా, కమిషనర్ మాట్లాడుతూ బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించలేదన్నారు. నూతన మున్సిపల్ కార్యాలయ పనులు మొదలై రెండేళ్లు దాటినా పూర్తికాకపోవడంపై ఆర్ ఎఇలను వివరణ కోరగా, చిన్నచిన్న పనులున్నాయని, రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. సమావేశ అనంతరం భూ సర్వే పరికరాలను, నూతన మున్సిపల్ కార్యాలయ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ జగన్నాథ్, ప్రత్యేక అధికారి మల్లయ్య, ఎఇలు సందీప్, సురేష్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల్లో పారుడు రోగం నివారణకు వైద్యం

ముద్దనూరు : పశువుల్లో పారుడు రోగం నివారణకు వైద్యం అందించినట్లు మండల పశు వైద్యాధికారి వాసా శ్రీనివాస తెలిపారు. మండలంలోని తిమ్మాపురంలో గురువారం డ్వామా కడప వారి సౌజన్యంతో మండల పశు వైద్యాధికారి వాసా శ్రీనివాస ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైసిపి మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు.

ఇరిగేషన్‌కు ఒక్క పైసా అయినా ఖర్చు చేశారా..?

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకాకుళం పర్యటనలో రూ.1000 కోట్లకు వాగ్దానాలు, శంకుస్థాపనలు చేశారని, వైసిపి అధికారం చేపట్టినప్పటి నుండి ఇప్పటి వరకు ఇరిగేషన్‌కు రూ.1 కూడా కేటాయిం చలేదని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి

వైఎస్ మానస పుత్రిక పోలవరం ప్రాజెక్టును వైసిపి అధికారం చేపట్టిన నాలుగేళ్ల కాలంలో పనులు ముందుకు సాగలేదన్నారు. 2014-19 కాలంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వంలో 80 శాతం పనులు పూర్తి చేశారని తెలిపారు. పులిచింతల ప్రాజెక్టు గేటు 2021లో కొట్టుకుపోతే ఇంతవరకు అమర్చలేదన్నారు. అన్నమయ్య, పింఛా ప్రాజెక్టుల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. ప్రొద్దుటూరులో రూ.516 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని చెప్పి ఇంతవరకు అతీగతీ లేదన్నారు. మీ మాటలు బూటకమని ప్రజలు మిమ్మల్ని సాగనంపేందుకు 2024లో సిద్ధంగా ఉన్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ పుల్లయ్య, మాజీ పట్టణ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు బొర్ర రామాంజనేయులు, అమీర్, ఖాదరబాద్ నాగమునిరెడ్డి, రామాపురం గురువిరెడ్డి, రసూల్, రఫీ, వద్ది బాలుడు పాల్గొన్నారు.

అందరి దగ్గర ఒకే సమాచారం ఉండాలి

ప్రజాశక్తి - లింగాల

మండలంలోని గర్భిణుల సంఖ్య నమోదు సమాచారం అందరి దగ్గర ఒకేలా ఉండాలని మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున తెలిపారు. స్థానిక ప్రాథమిక వైద్య కేంద్రం వద్ద గురువారం ఎఎన్ఎం, అంగన్వాడీ, ఐసిడిఎస్, మహిళా పోలీస్ వారికి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ గర్భిణుల పేర్లు నమోదు ఒకే గ్రామంలో ఒక్క చోటు మాత్రమే ఉండాలన్నారు. ఈ సమాచారం ఆయా నాలుగు శాఖల వద్ద ఒకే విధంగా ఉండాలని కోరారు. అలాగే అంగన్వాడీ టీచర్లు కొందరు అటెండెన్స్ వేసుకొని ఇళ్లకు వెళ్లిపోతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. మళ్లీ ఇలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని కోరారు. ఎంపిడిఒ సురేంద్రనాథ్, వైద్యాధికారి సుహాసిని పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పర్యటన

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రజల సమస్యల పరిష్కారానికే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి తెలిపారు. స్థానిక రజక వీధి, యానాది కాలనీలో గురువారం మాజీ ఎంపిపి ముని రాజారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రతి గడపకు తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక కొత్త కొట్టాల వీధిలో రూ.15లక్షలతో ఏర్పాటు చేయనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమణారెడ్డి, డిటి సుధీర్ యాదవ్, వైసిపి నాయకులు డాక్టర్ నవజ్యోత్‌రెడ్డి, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు గుర్రప్ప, సచివాలయం కన్వీనర్ సుమంత్ యాదవ్, మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, ఎంపిటిసిలు ఇంద్రాణి, రమేష్, నాయకులు పుల్లయ్య యాదవ్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ నరసింహులు పాల్గొన్నారు.

సిసిరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్‌జైల్ సూపరింటెండెంట్ సురేష్ హాజరయ్యారు. సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి రఘునాథ మాట్లాడుతూ వారోత్సవాలను విజయవంతం చేసినందుకు సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు అగ్నిమాపక శాఖ అధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ వైద్యశాల సహకారంతో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. అధితిగా హాజరైన సురేష్ రక్త దానం ఇవ్వడంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసినవారిలో సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి రఘునాథ, లీడింగ్ ఫైర్‌మెన్ సుధాకర్, డ్రైవర్ ఆపరేటర్స్ శ్రీనివాసులరెడ్డి, బుజ్జిబాబు, ఫైర్‌మెన్లు హరికృష్ణ, నరేంద్ర ˇకుమార్, ప్రేమ్‌కుమార్, జాలయ్య, కుమారస్వామి, హోంగార్డు నాగేశ్వరరెడ్డి ఉన్నారు.

పులివెందుల టౌన్ : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా చివరి రోజు గురువారం అగ్నిమాపక కార్యాలయంలో ప్రమాద సమయాల్లో ఉపయోగించే పరికరాలపై విద్యా ర్థుల ప్రదర్శిం చారు. వీటిపై అగ్నిమాపక కేంద్ర ఇన్‌ఛార్జి రామకృష్ణ అవగాహన కల్పిం చారు. అగ్ని ప్రమా దాలు, గ్యాస్ లీకేజీ ప్రమాదాలు జరిగి నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది రవీంద్రారెడ్డి, శంకర్‌రెడ్డి, నరసింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిమాపక పరికరాలపై వివరిస్తున్న సిబ్బంది

వేంపల్లె : అగ్ని ప్రమాదాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి సూచించారు. అగ్ని మాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం స్థానిక అగ్ని మాపక కేంద్రంలో స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని మాపక పరికరాల గురించి ఫైర్ ఆఫీసర్ శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఫైర్‌స్టేషన్ సిబ్బంది వెంకట సుబ్బయ్య, హరిబాబు, మహమ్మద్ సాలార్ పాల్గొన్నారు.

సరైన సమయంలో పౌష్టికాహారం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సరైన సమయంలో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలని కామనూరు ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హనీఫ్ బాబా తెలిపారు. గురువారం పట్టణం బి.సి.ప్రజా చైతన్య సమాఖ్య కార్యాలయంలో అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్తలకు, మహిళా పోలీసులకు సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, హెచ్ఇ శోభరాణి, సిహెచ్ఒ క్రిష్ణమ్మ, సూపర్‌వైజర్స్ బిఎ వరప్రసాద్, చంద్రకళ, షంషాద్, ఈశ్వరి పాల్గొన్నారు.

వేసవి తాపాన్ని తీరుస్తున్న తాటి ముంజలు

తాటి ముంజలు తీస్తున్న వ్యాపారులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వేసవికాలంలో తాటి ముంజలకు భలే గిరాకీ ఉంటుంది. ఎండలకు తాటి ముంజలు సేదదీరుస్తాయి. డజను తాటి ముంజలు రూ.100పలుకుతున్నా, గిరాకీ మాత్రం తగ్గడంలేదు. వాటిని కొనేందుకు ప్రజలు ఏమాత్రం సంకోచించడంలేదు. మండే ఎండల్లో తాటి ముంజలు ఉపశమనం ఇవ్వడంతోపాటు వేడిని తగ్గిస్తాయని పలువురు పేర్కొంటున్నారు. పులివెందుల పట్టణంలో గతేడాది డజన్ రూ.60 ఉండేది. చుట్టుపక్కల గ్రామాలైన ఎర్రిపల్లి,అచ్చువల్లి, ఉలిమెళ్ళ నుంచి తాటికాయలను తీసుకొచ్చి, పట్టణంలో విక్రయిస్తున్నారు. గతంలో కన్నా ఈ ఏడాది పంట తక్కువగా రావడంతో తాటి కాయల ధరలు పెంచారు. వేసవిలో తాటి ముంజలను అందరూ ఇష్టంగా తింటారని, ధర ఎక్కువైనా కొంటారని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ప్రహరీ ఏర్పాటు చేయరూ..!

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక అగ్రహారంలోని అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అంగన్వాడీ కేంద్రం చుట్టూ కంపచెట్లు ఏపుగా పెరిగి ఉండడం వల్ల ప్రహరీలేక విష ప్రాణుల తాకిడి ఎక్కువైందని అక్కడికి వచ్చే గర్భిణులు, బాలింతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక చిన్నారులకు ప్రమాదాలు పొంచి ఉన్నాయని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. అంగన్వాడీ కేంద్ర భవనం నిర్మించే సమయంలోనే ప్రహరీ ఏర్పాటు చేయాలని కోరినా.. సంబంధిత అధికారులు పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అంగన్వాడీ కేంద్ర భవనానికి ప్రహరీ నిర్మించి, సమస్య లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రహరీకి నోచుకోని అంగన్వాడీ భవనం

అభివృద్ధి పనుల పూర్తికి చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పులివెందుల పాడా ప్రత్యేకాధికారి అనిల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక పాడా కార్యాలయంలో గురువారం ఆయన అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. అనంతరం పనులపై శాఖల వారీగా చర్చించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దముడియం

ప్రకృతి వ్యవసాయంపై కెపితో అవగాహన కల్పిస్తున్నామని ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ పి.రామచంద్రయ్య అన్నారు. మండలంలోని జంగాలపల్లె యూనిట్‌లోని జంగాలపల్లె, జె.కొట్టాలపల్లె గ్రామాల్లో గురువారం కెపి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గురుమూర్తి, సుబ్బలక్ష్మి, సుమలత వెంకటేష్, సురేష్ విఒ నాయకులు, చంద్రలీల, కుల్లాయమ్మ, రైతులు పాల్గొన్నారు.

22, 23న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రంజాన్ పండుగను పరిష్కరించుకొని శిల్పారామంలో శని, ఆదివారాల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పరిపాలన అధికారి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన ప్రజలను కోరారు.

సచివాలయంలో 'స్పందన' పరిశీలన

ప్రజాశక్తి - ముద్దనూరు

మండల కేంద్రంలోని సచివాలయం-1, 2లను గురువారం డివిజనల్ లెవెల్ డెవలప్మెంట్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సచి వాలయాల్లో నిర్వహించాల్సి స్పందన కార్యక్రమాన్ని పరిశీలిం చారు. ప్రతి రోజు సచివాలయాల్లో మధ్యాహ్నం స్పందన కార్యక్రమం నిర్వహించాలని సిబ్బందికి సూచిం చారు. ప్రజల అర్జీలను స్వీకరించి సమస్యలు పరిష్కరించాలని ఆదేశిం చారు. సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి లక్ష్మి నరసింహులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONOURABLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, KADAPA.

O.S.No. 41/2023

Anand anil Kumar. **...Plaintiff**

Vs

1. Tippagandla Raju, W/o T.Pushpa Raju, aged about 35 years, Occ: House wife, D.No.10/164, Balaji Nagar, Kadapa City and YSR (D).
2. T.Pushpa Raju, H/o Tippagandla Raju, aged about 42 years, Occ: ARPC ID No.216, r/o D.No.10/164, Balaji Nagar, Kadapa City, YSR District.

...Defendants

NOTICE TO DEFENDANTS

ఇందుమూలముగా ప్రతివాది అయిన మీకు పై దావాలో తెలియజేయడం ఏమనగా వాది మీ పై దావా దాఖలా చేసి యున్నారు. సదరు దావా మీ నోటీసుకు గాను 1/5/2023వ తేదీన వాయిదా వున్నది. కావున మీకు 1/5/2023వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై తెలిపిన కోర్టు నందు స్వయముగా గాని లేక వకీలు ద్వారా గానీ హాజరై ఎటువంటి ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో రాజశ్రీ కోర్టు వారు నీ పై పరోక్షముగా తీర్మానించబడును.

// By Order of the Court //

N.PRASANNA KESAVA, M.Sc.,LL.B.
M.AYYAVARAPPA, B.A.,LL.B.
A.MUNIRATHNA RAJU, B.A.,LL.B.
Advocates,
Kadapa. 8328451228, 8639175039.